శివరాత్రి విశిష్టతపై ప్రవచనం

సుభాష్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సూరారం ఉమామహేశ్వర ఆలయంలో ధార్మిక ప్రవచనాలు నిర్వహించనున్నట్లు సంస్థ ధర్మాచార్య పసుపులేటి నరేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని అన్నారు. అందులో శివరాత్రి పర్వదిన విశిష్టతను వివరిస్తారని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రవచన కార్యక్రమంలో పాల్గొనాలని నరేంద్ర కోరారు.

పండ్ల దుకాణంలో పేలిన గ్యాస్ సిలిండర్లు

రూ.3లక్షల ఆస్తినష్టం



కుత్బుల్లాపూర్: పండ్ల దుకాణంలో గ్యాస్ సిలిండర్లు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో ఆస్తినష్టం వాటిల్లిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుచిత్ర సమీపంలో హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీకి చెందిన సురేందర్ సుచిత్ర ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా పండ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి గంటలకు దుకాణం మూసేసి ఇంటికి వెళ్లాడు. కాగా రాత్రి 11గంటల సమయంలో దుకాణంలో ఉంచిన రెండు గ్యాస్ సిలిండర్లు ప్రమాదవశాత్తు పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి దుకాణం మొత్తం కాలిబూడిదయ్యింది. మంటలతో చుట్టు పక్కల ఇళ్ల వాసుల పరుగులు తీశారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.3లక్షల విలువ చేసే ఆస్తినష్టం జరిగిందని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ఫస్టియర్ పరీక్ష







కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8గంటల వరకే విద్యార్థులు సెంటర్లకు చేరుకున్నారు. 8.30 నుంచి విద్యార్థులను సెంటర్లలోకి పంపించారు. మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. కొంతమంది విద్యార్థులకు కేంద్రాల చిరునామాలు తెలియక ఒక ప్రాంతంలో ఎగ్జామ్ ఉండగా మరో ప్రాంతానికి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరీక్షల సందర్భంగా ఉదయం వేళల్లో సెంటర్ల వద్ద వారి తల్లిదండ్రులు రావడం వల్ల కొంత ట్రాఫిక్ ఏర్పడింది. – సుభాష్‌నగర్

మోదీ మూడోసారి ప్రధానిగా గెలిపించాలి

బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్

దుండిగల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నరేంద్ర మోదీని తిరిగి మూడోసారి గెలిపించాలని బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్ అన్నారు. గండిమైసమ్మలోని దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ ఇంట్లో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్ స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకునే విధంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, కౌన్సిలర్ రాముగౌడ్, నాయకులు గిరివర్ధన్‌రెడ్డి, శ్యామ్‌రావు, శ్రీశైలంయాదవ్, కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నేతలతో ఈటల రాజేందర్

ఎంఎల్ఆర్ఐటీలో వైజ్ఞానిక ప్రదర్శన

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో 7వ జాతీయ వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగం, ఎంఎల్ఆర్ఐటీ, ఏరో క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం సందర్భంగా ప్రదర్శన నిర్వహించారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దాదాపు 50 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఈ జాతీయ విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలో తమ నమూనాలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు జ్ఞానికలు, ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసరావు, ఏరోనాటికల్ హెచ్ఓడి డాక్టర్ ఎం సత్యనారాయణ గుప్తా, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందానగర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..



ఘనంగా జాతీయ సైన్స్ డే

ప్రముఖ భౌతికశాస్త్ర పరిశోధకుడు, నోబెల్ గ్రహీత సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొన్నారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం 1929లో నైట్‌హుడ్ బిరుదును అందజేసింది. భౌతికశాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం 1954లో భారతరత్నతో సత్కరించింది. దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా బుధవారం నియోజకవర్గంలోని పాఠశాలల్లో వైజ్ఞానికి ప్రదర్శనను నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను అతిథులు తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రామన్ ఎఫెక్ట్ అసామాన్యమైందని అన్నారు. కేవలం రూ.200 విలువ చేసే పరికరాలతో దృగ్విషయ నిరూపణ జరగడం అద్భుతమైందని ప్రపంచ శాస్త్రజ్ఞులే కొనియాడారని పేర్కొన్నారు. ఈ పరిశోధనను గుర్తించిన రాయల్ స్వీడిష్ అకాడమీ 1930లో నోబెల్ బహుమతి ప్రదానం చేసిందని గుర్తు చేశారు. – జీడిమెట్ల



అపురూపా కాలనీ టీవీఆర్ మోడల్ స్కూల్‌లో..



కుత్బుల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ లో..



చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని బీపీఎస్‌లో..

వాహనాల ఓవర్‌లోడ్‌లను అరికట్టాలి

రంగారెడ్డి డీటీసీ ఎం. చంద్రశేఖర్‌గౌడ్



కుత్బుల్లాపూర్: ఓవర్‌లోడ్ వాహనాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని రంగారెడ్డి డీటీసీ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని మేడ్చల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన వాహనదారులకు అందుతున్న సేవలను దగ్గరుండి పరిశీలించారు. లైసెన్స్ జారీ, వాహన రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ జారీలు జరుగుతున్న తీరును.. సంబంధిత ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ.. వాహనదారుల సందేహాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌డెస్క్‌లను పటిష్టం చేయాలన్నారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. వాహన తనిఖీ అధికారులు ప్రతి నెల 5వ తేదీ లోగా చెక్ రిపోర్ట్ నివేదికను అందజేయాలన్నారు. ఓవర్‌లోడ్‌లను అరికట్టడానికి ప్రత్యేక తనిఖీలు చేయాలని ఆదేశించారు. మేడ్చల్ డీటీవో రఘునందన్‌గౌడ్, ఎంవీఐలు ప్రతాప్ రాజా, బాబు, శిల్ప, ఏఎంవీఐ త్రివేణి బాయి, ఏవోలు రామకృష్ణ, ఇఫ్తేకార్ ఇతర కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

విజయగణపతి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కుత్బుల్లాపూర్: వినాయకుడిని పూజించడం ద్వారా తలపెట్టిన ప్రతి పనిలో విజయం చేకూరుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ న్యూ వివేకానందనగర్‌లో నూతనంగా నిర్మించ తలపెట్టిన విజయగణపతి దేవాలయ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడిని పూజిస్తే అంతా మంచే జరుగుతుందన్నారు. ఆలయాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు, సుధాకర్‌గౌడ్, ఎల్లాగౌడ్, సందీప్, శ్రీనివాస్, దేవాలయ ట్రస్టీ దాస్‌గౌడ్, ట్రెజరర్ బీఆర్.విశాల్, బుచ్చిరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సత్తయ్యగౌడ్, అనిల్‌కుమార్, రమణారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.